మ. పటుగోరక్షణముం గృషిక్రియ యనల్పంబైన వాణిజ్యమున్
దిటవొప్పం దమవృత్తులై నడువ నర్థిన్నిత్యసంపాది తో
త్కట నానాధనధాన్యలాభముల యక్షస్వామి నోడించు గో
మటు లవ్వీట వసించియుందురు సమృద్ధానపాయిణులై. 50

కం. ధీరు లసత్క్రియాపరుల, మహో
దారులు సత్పాత్రముల, బుధద్విజసేవా
ధీరులు సంగ్రామకళా
శూరులు తత్పురి వసించు శూద్రప్రవరుల్. 51

ఉ. కొండలపెంపు గెల్చు రథకోటులు వాజులు మొక్కళ్ళభంగి నొం
డొండ చెలంగు మత్తకరు లుజ్జ్వలఘోటకముల్ ప్రచండ కో
దండకళోద్భటుల్ భటు లుదగ్రతఁ బెంపువహింప వైరి దో
శ్చండిమ గండడంచు బలసంపద నప్పుర మొప్పు నెంతయున్. 52

చం. సరసిజపత్రలోచనలు చంద్రనిభాస్యలు తప్తహేమసుం
దరతనువల్లు లుల్లసితధర్మ పరిశ్రమనైపుణీ మనో
హరచరితల్ పతిప్రియగుణాన్విత లవ్యయపుణ్యగణ్య ల
ప్పురిని పురంధ్రికామణులు పొల్పువహింతురు శీలసంపదన్. 53

సీ. తనుకాంతులకు నోడి తపియించి కరఁగు హే
మార్తికి హేమ తా నార్తిఁ గాంచె
విపులోరుదీప్తికి వెలి యూఁది రంభ కం
పింపంగ రంభ కంపింపఁదొడఁగె
కమనీయనిటలరేఖకు నోడి శశిరేఖ
కృశియింప శశిరేఖ కృశత గాంచె
విమలలోచన సౌష్ఠవమునకు హరిణి భీ
తిలఁ జూచి హరిణి భీతిల్లఁదొడఁగె

తే.గీ. నప్పురమ్మున నుండు వారాంగనాంగ
శోభమాన పుంజంబిట్టు లోటువడుట
గాంచి తన్నామ గంధయోగమునఁ జేసి
తలఁకి రప్పుర లెద నవత్రప జనింప. 54

చం. కులుకుమిటారిచన్గవలు కోమలబాహులతా యుగంబు లం
చలగతులన్ గలంచు నడ, సన్నపుగౌనులు విద్రుమంపు సొం
పలవడుకెంపు వాతెఱ, లొయారపుఁజైవులు వింతగూర్చు చెం
తల వెలయాంద్రఁ గన్గొనినఁ దావసులైనఁ జలింతు రప్పురిన్. 55

సీ. శుభనాస! చాంపేయసూన మంటెద మన్న
నందునే చంద్రమధ్యస్థ మంద్రు
ఏణాక్షి! కలువ లాఘ్రాణింతు మన నుర్ల
భము జోడువిండ్లు కాపాడు నంద్రు
సుకుచ! తామరమొగ్గలకు జయంబగు నవం
భస్థానజములు చేపడునె యంద్రు
సుదతి! కందమ్ములసాం [పెద్దియనసుధా]
స్వాదమ్ములవి యగోచరము లంద్రు

తే.గీ. చారుగతి నొప్పు విపణిదేశములయందు
వగసుమస్తోమ విక్రయవ్యాజగతుల
కాముకులతోడ సరసవాగ్రచన లెసఁగ
వీటఁజరియించు కుసుమలావీజనమ్ము. 56

సీ. చెలి! సనోచితముఖోజ్జ్వలమైనమావి కెం
జిగురొకించుక నొక్కఁజెందరాదె!
శుకవాణి! యళి లసల్లికుచగుచ్ఛమ్ములు
డాసి గోరంత ముట్టంగరాదె!
రుచిరాంగి! విరళాప్త రోచనాబ్జంబులు
కోరి యొక్కంత మూర్కొనఁగరాదె!
సకియ! వికారమై చను వికచోత్పల
శ్రేణి మెల్లన సవరింపరాదె!

తే.గీ. యనుచుఁ బల్లవు లధరస్తనాక్షి కేశ
కలనభాషింపఁ దేనెలు గాఱిపోవు,
నొక్కులగు, కారెసఁగు దేంట్లు గ్రక్కసించు
వలదువలదంద్రు సుమలావికలు పురమున. 57